సమస్యలు.. సతమతం


చింతల్ మాణిక్యనగర్ ప్రధాన రోడ్డులో..


శ్రీనివాస్‌నగర్ నందిని మెడికల్‌హాల్ వద్ద..

జర భద్రం...

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మ్యాన్‌హోల్‌లు ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా రాత్రి సమయాలలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు కొంచెం కొంచెంగా లోపలికి కుంగి ప్రమాదాలకు దారి తీస్తోంది. ఈ విషయమై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఎటువంటి సంఘటన జరగక ముందే వీటి మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


ప్రసూననగర్ ప్రధాన రహదారిలో...


రాంరెడ్డినగర్ తెలంగాణ తల్లి విగ్రహం వద్ద..

ప్రమాదకరంగా..


నందిని ఆస్పత్రి సమీపంలో ప్రమాదకరంగా ఉన్న వరదనీటి డ్రైయిన్ మూత

రంగారెడ్డినగర్: వరదనీరు సాఫీగా వెళ్లేందుకు స్ట్రామ్ (వరద) డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన ఇనుప మూత ప్రమాదకరంగా మారినా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. చింతల్ మార్కెట్‌రోడ్డులోని నందిని ఆస్పత్రి సమీపంలో రోడ్డుపై వరదనీరు నిల్వకుండా వరద నీటి డ్రెయిన్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మించారు. అయితే డ్రెయిన్‌పై ఏర్పాటు చేసిన ఇనుప మూత అటుగా రాకపోకలు సాగించే వాహనాలతో కిందకు దిగబడింది. దీంతో ఇనుప మూతను గమనించకగా వేగంగా వచ్చిపోయే వాహనదారులు ఢీకొంటున్నారు. ప్రమాదకరంగా మారిన డ్రెయిన్ మూతను సరి చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బీ కేర్‌ఫుల్

నామినేషన్ పత్రాల దాఖలులో జాగ్రత్త అవసరం

- నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- అభ్యర్థులు ఆర్‌ఓకు సమర్పించే పత్రాలే కీలకం
- జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేల డిపాజిట్ చేయాలి
- ఆర్‌ఓ వద్దకు అభ్యర్థితోపాటు నలుగురికి మాత్రమే అవకాశం



సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో.. నామినేషన్ల దాఖలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఎన్నికల సంఘం పలు సూచనలు చేస్తోంది. వీటిని ఖచ్చితంగా పరిగణనలోని తీసుకోవాల్సింటుందని పేర్కొంటుంది. ఈ నేపథ్యంలోనే నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థులు సమర్పించనున్న పత్రాలకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఏ-ఫాం, బీ- ఫాం, అఫిడవిట్ తదితర అంశాల ప్రాముఖ్యతను అభ్యర్థులు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ పత్రాలను దాఖలు చేసే అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత నియోజకవర్గంలో ఓటరై ఉండాలి. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీలకు చెందిన అభ్యర్థిని అతను పోటీ చేస్తున్న నియోజకవర్గ పరిధిలోని ఓటరు ప్రతిపాదించాల్సింటుంది. స్వతంత్ర, గుర్తింపు లేని పార్టీల అభ్యర్థులను మాత్రం పది మంది ఓటర్లు ప్రతిపాదించాల్సి ఉంటుంది. ప్రతిపాదించే వారు తన ఓటరు జాబితా వివరాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది.

◆ అభ్యర్థి నేరుగా లేదా తనను ప్రతిపాదించే వ్యక్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేసేందుకు అవకాశముంది. అసెంబ్లీ నియోజకవర్గ స్థానంలో నామినేషన్ దాఖలుకు అభ్యర్థి వయస్సు 25 ఏళ్లు నిండి ఉండాలి. తెలంగాణ రాష్ట్ర పరిధిలోని ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గంలో బరిలో నిలిచే అభ్యర్థికి ఖచ్చితంగా ఓటు హక్కు కలిగి ఉండాలి. నామినేషన్ పత్రాలు దాఖలు చేసే సమయంలో అభ్యర్థితో పాటు నలుగురి వ్యక్తులను మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతిస్తారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జనరల్ స్థానంలో పోటీచేసే అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే రూ.5 వేలు డిపాజిట్(ధరావతు) చెల్లించాల్సి ఉంటుంది. ఈ డిపాజిట్ సొమ్మును బ్యాంకు చలానా రూపంలో చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్ పత్రంతో జత చేయాలి. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థి ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా తెరవాల్సి ఉంటుంది. ఈ బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంది. బ్యాంకు ఖాతా వివరాలను నామినేషన్ పత్రంలో తప్పని సరిగా పేర్కొనాలి. అభ్యర్థి పది పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను నామినేషన్ పత్రంతో జతపరచాలి. నామినేషన్ పత్రాల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి ఎదుట అభ్యర్థి ప్రతిజ్ఞ చేయాల్సింటుంది. గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్రస్థాయి పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ పత్రంతో పాటు పార్టీ జారీ చేసిన ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. అభ్యర్థి తన నేర చరిత్ర, తనపై నమోదైన పోలీసు కేసులు, ఇతరత్రా కోర్టులో విచారణలో ఉన్న కేసుల వివరాలతో సహా తనతోపాటు, భార్య, పిల్లల స్థిర, చరాస్తులు, అప్పులు, బ్యాంకులో డిపాజిట్లు, నగదు నిల్వ వివరాలు వెల్లడిస్తూ అఫిడవిట్ (ప్రమాణ పత్రం) సమర్పించాల్సి ఉంటుంది.

బీ-ఫాం అంటే..

పార్టీ తరపున ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే పత్రమిది. తమ పార్టీ నుంచి ఫలానా వ్యక్తి పోటీ చేస్తున్నారని, పార్టీ గుర్తు కేటాయించాలని అభ్యర్థించటమే ఈ బీ-ఫాం పత్రం ముఖ్యోద్దేశం.

ఏ ఫాం అంటే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థిని ధ్రువీకరించేందుకు జాతీయ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్రస్థాయిలో ఒకరికి అధికారం అప్పగిస్తారు. అభ్యర్థికి సదరు వ్యక్తి బీ- ఫాం జారీ చేస్తారు. రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన పార్టీ అధ్యక్షుడు తాను లేదా మరొకరికి, లేదా జిల్లాస్థాయిలో ఒకరికి బీ-ఫాం జారీచేసే అధికారాన్ని అప్పగిస్తుందని ఏ- ఫాం సూచిస్తోంది. ఏ- ఫాం ద్వారా అధికారం పొందిన వ్యక్తి పోటీచేసే అభ్యర్థికి బీ-ఫాం ఇస్తారు. ఏ-ఫాం, బీ-ఫాం పత్రాలు నామినేషన్ దాఖలు సమయంలో లేదా నామినేషన్ పత్రాల దాఖలు చివరి రోజు మధ్యాహ్నం 3 గంటల్లోగా సంబంధిత రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)కి అందించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల సంఘం పేర్కొంటోంది.

జంగ్ తెలంగాణ 2023

బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్
- డివిజన్ల ముఖ్య కార్యకర్తలతో సమావేశం
- పాల్గొన్న గోవా బీజేపీ అధ్యక్షుడు సదానంద్ తక్వాడే


ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని.. కేసీఆర్ కుటుంబమే బాగు పడిందని బీజేపీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్ విమర్శించారు. సోమవారం గాజులరామారం, సూరారం, చింతల్, జగద్గిరిగుట్ట డివిజన్ల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశానికి గోవా బీజేపీ అధ్యక్షుడు సదానంద్ తక్వాడే, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ ప్రజలు రెండు దఫాలుగా వివేకానంద్‌ను ఎమ్మెల్యేగా గెలిపించినా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి బీజేపీ విజయానికి కృషి చేయాలన్నారు. వచ్చే నెల రోజులు చాలా ముఖ్యమని, ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని సూచించారు.

◆ ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ ఆర్‌కే శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ బుచ్చిరెడ్డి, నాయకులు కూన శ్రీనివాస్‌గౌడ్, జేకే శేఖర్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, బావిగడ్డ రవి, చండి శ్రీనివాస్, డివిజన్ల అధ్యక్షులు సాయినాథ్, పున్నారెడ్డి, పత్తి సతీష్, దుర్యోధనరావు, జిల్లా నాయకులు, డివిజన్ నాయకులు, శక్తికేంద్ర ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు


కూన శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరిన పలు పార్టీల నాయకులు

కుత్బుల్లాపూర్: రంగారెడ్డినగర్ పరిధిలోని గుబురుగుట్ట, సంజయ్ గాంధీనగర్, జీడిమెట్ల డివిజన్ ఎన్‌సీఎల్ కాలనీలకు చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శ్రీశైలంగౌడ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రంగారెడ్డినగర్ డివిజన్ నాయకులు బండారు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు గరిగే శేఖర్ ముదిరాజ్, నాయకులు సుదీర్ కుమార్, క్రాంతి, సర్వేశ్వర్, ఎన్‌సీఎల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాంబశివరాజు, సుధాకర్‌రెడ్డి, శివరామరాజు, కాశిరత్నం, సాయిబాబా, పెంటయ్య, రాజయ్య, చిన్న, వినయ్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ల వెంబడి నాటిన మొక్కలు మాయం


ఆరు నెలల క్రితం ఐడీపీఎల్ చౌరస్తాలో పచ్చదనంలో ఫుట్‌పాత్ ప్రాంతం


నేడు పచ్చదనం కరువై ఇలా..

రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల అభివృద్ధిలో భాగంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోన ఐడీపీఎల్ చౌరస్తా, అయోధ్య నగర్ పరిధిలోని కృష్ణ కుంజు చౌరస్తాల వద్ద డివైడర్ల మధ్య 'యుఫోర్‌బియా మిల్లి'జాతి మొక్కలతో పాటు మల్బర్ మొక్కలను నాటారు. అయితే నాటిన ఆరు నెలల వ్యవధిలో డివైడర్ల వెంబడి నాటిన యుఫోర్‌బియా మిల్లి, ఇతర మొక్కలు మాయమయ్యాయి.

◆ ప్రస్తుతం ఆ ఫుట్‌పాట్ పక్కల పచ్చదనం కరువై మల్బర్ మొక్కలు మాత్రమే దర్శమిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది సరైన వాటరింగ్ చేయకపోవడం, విలువైన మొక్కల రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ఎవరైనా ఎత్తుకెళ్లి ఉంటారనే గుస గుసలు వినిపిస్తున్నాయి. ఏదీ ఏమైనా అధికారుల నిర్లక్ష్యంతో మొక్కలు మాయమై ప్రజాధనం వృథా అయిందని పలువురు ఆరోపిస్తున్నారు.

సీపీఈయూ కార్యదర్శి కారు ధ్వంసం

బంజారాహిల్స్: అర్ధరాత్రి తన ఇంటి వద్దకు వచ్చి రాళ్లతో కారు అద్దాలను ధ్వంసం చేయడమే కాకుండా తనకు హెచ్చరికలు జారీ చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ యూనియన్ (సీపీఈయూ) సెక్రటరీ కాట్రగడ్డ సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని కమలాపురి కాలనీలో నివసించే కాట్రగడ్డ సుధాకర్ ఇంటికి అదే యూనియన్‌లో గతంలో ఉపాధ్యక్షుడిగా పని చేసిన ఆర్టిస్టల మేనేజర్ జి.హరినాథ్ అర్ధరాత్రి ఒంటి గంటకు వచ్చాడు. ఆ సమయంలో సుధాకర్ నిద్రపోతున్నాడు. మద్యం మత్తులో తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్న హరినాథ్ అక్కడే ఒక సెల్ఫీ వీడియో తీసుకొని సుధాకర్‌కు హెచ్చరికలు జారీ చేశాడు. అంతు చూస్తానని బెదిరించాడు. దమ్ముంటే రా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. అంతే కాకుండా అక్కడే ఉన్న రెండు రాళ్లు తీసుకొని సుధాకర్ కారు అద్దాలను ధ్వంసం చేశాడు. ఇటీవల ఎన్నికల్లో తనపై పోటీ చేసి ఓడిపోయినప్పటి నుంచి కక్షపెంచుకున్నాడని ఆయన నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ సుధాకర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సురక్షితమైన తాగునీరు అందించడానికి కృషి



చింతల్: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ జలమండలి మేనేజర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం సుభాష్‌నగర్ పైపలైన్ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఎక్సలెన్సియా అకాడమీ సమీపంలో ధ్వంసమైన 450 ఎంఎం సీవరేజీ పైపులైన్ మరమ్మతుల పనులు చేపట్టగా ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిధుల లేమి ఉన్నప్పటికీ ప్రాధాన్యత క్రమంలో మరమ్మతులు చేపడుతూ వస్తున్నామన్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్లపై కేటీఆర్ వ్యాఖ్యలు బాధాకరం

పంజగుట్ట: ఎల్‌ఐసీ ఏజెంట్లను కించపరిచేలా మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలు సరికాదని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ ఎస్.బి.శ్రీనివాసాచారి అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉపాధ్యక్షుడు ఎమ్.ఎస్.మూర్తి, కోశాధికారి బి.శ్రీరామ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ... కరీంనగర్ సభలో మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్నారు. వెంటనే ఏజెంట్లకు నష్టం వాటిల్లకుండా ఏదైనా ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మాజీ అధ్యక్షుడు బి.ఎన్.చారి, సింగారపు శ్రీనివాస్, సూరి సీతారాం, ఉదయభాను, కట్ట వెంకట్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదపుటంచున..


రోడ్డు పక్కన మధ్యలో విరిగిన విద్యుత్ పోల్

సుభాష్‌నగర్: గాజులరామారం గ్రామం ప్రధాన రోడ్డు ప్రక్కన ఓ విద్యుత్ స్తంభం మధ్యలో విరిగి ప్రమాదంగా ఉంది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రోడ్డులో జరగరానిది ఏదైనా జరిగితే భారీ ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు దృష్టి సారించి తక్షణమే మధ్యలో విరిగిపోయిన విద్యుత్ పోల్‌ను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

బీహెచ్‌ఈఎల్ హౌసింగ్ సొసైటీ నూతన కార్యవర్గం

శేరిలింగంపల్లి: బీహెచ్‌ఈఎల్ ఎంఐజీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా సోమవారం ఎన్నుకున్నారు. ఈ నెల 28వ తేదీన జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన మేనేజింగ్ కమిటీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.వెంకట్రావ్, ఉపాధ్యక్షులుగా ఎస్.నారాయణ, కార్యదర్శిగా కెవీ.సుబ్బారావు, కోశాధికారిగా ఎం.నీలకంఠరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా చింత రాములు, సి.విద్యాధరిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను కాలనీవాసులు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

- ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ
- మాదిగల విశ్వరూప సభకు ప్రధాని మోదీని ఆహ్వానించాం


భగత్‌సింగ్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతన్న మందకృష్ణ మాదిగ

చింతల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఈనెల 18న జరిగే మాదిగల విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సిలువేరు శ్రీనివాస్‌మాదిగ ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

◆ ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ... మాదిగల విశ్వరూప సభకు ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించామన్నారు. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కళామండలి అధ్యక్షుడు అశోక్ మాదిగ, మేడ్చల్ జిల్లా నాయకులు ప్రణయ్ కుమార్ మాదిగ, బచ్చలకూర స్వామి, అల్లాబకాష్, ఇస్రాం, రమేష్ మట్ట, నరసింహులు, మహిళా నాయకురాలు జ్యోతి, సలోమి, భూమయ్య, రమేష్, జాన్, చారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

దుండిగల్: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేయించుకోవాలని... మంగళవారంతో గడువు ముగుస్తుందని ఎన్నికల అధికారులు తెలిపారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని గాగిల్లాపూర్ వార్డు కార్యాలయం, పోస్ట్ ఆఫీస్, తాండాల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు. ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకునే విధంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు లత, సురేశ్, దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ రావు, తహశిల్దార్ సుచరిత. మున్సిపల్ మేనేజర్ నర్సింహులు, శ్రీను, మంజుల, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

'అభివృద్ధిని ఆకాంక్షించే వారు బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారు'

మంత్రి కేటీఆర్


మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన ఎంఎస్‌వాసు తదితరులు. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద్, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్: మత రాజకీయాలు చేసే బీజేపీతో ప్రజలు విసుగు చెందారని, ఒక్కొక్కరిగా ఆ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారం ప్రగతిభవన్‌లో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యుడు ఎంఎస్‌వాసు, సుభాష్‌నగర్ డివిజన్‌కు చెందిన గుబ్బల లక్ష్మీనారాయణ, ఆడబాల వెంకటరత్నం, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీదేవిరెడ్డి తదితరులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కమలం పార్టీ రోజు రోజుకు వాడిపోతోందన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే ప్రజలు బీఆర్‌ఎస్‌తోనే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం


కొలన్ హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన యువత, మహిళలు

కుత్బుల్లాపూర్ అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డ, రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధి గాంధీనగర్, గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్, జగద్గిరిగుట్ట శ్రీనివాస్‌నగర్‌లకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పిన హన్మంతరెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలకు ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. కేసీఆర్ చెప్పే మాయమాటలు, మోసపూరిత హామీలను నమ్మేస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. బడుగు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

రంగారెడ్డినగర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యపడుతుందని.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వివేకానంద్‌ను మరోసారి ఆశీర్వదించాలని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఇందిరగాంధీనగర్, సౌభాగ్యనగర్‌లలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సౌభాగ్యనగర్‌లో కరపత్రాలు పంచుతున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

హ్యాట్రిక్ సాధించాలని...



కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేగా వివేకానంద్ హ్యాట్రిక్ సాధించాలని రంగారెడ్డినగర్ డివిజన్ వార్డు సభ్యుడు అబ్దుల్ ఖాదర్, విజయనగర్‌కాలనీ వైస్ ప్రెసిడెంట్ మల్లం శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు బాలునేత, తుమ్మ నవీన్‌ల ఆధ్వర్యంలో ముంబైలోని సిద్ధి వినాయక ఆలయం, హాజీ అలీదర్గాలలో ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించారు.

– రంగారెడ్డినగర్

భీమాగార్డెన్స్‌లో ఘనంగా ప్రజా ఆశీర్వాద సభ..

కుత్బుల్లాపూర్: సూరారం భీమాగార్డెన్స్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్యే వివేకానంద్, ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంభీపూర్‌రాజులు మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో పవర్ హాలీడేలు, మంచి నీటి కష్టాలతో తెలంగాణ ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. నేడు సీఎం కేసీఆర్ సారథ్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సంతోషంగా ఉన్నారన్నారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, సీఎం రిలీఫ్ ఫండ్, దళిత బంధు పథకాలతో లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని తెలిపారు. నవంబరు 30న జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించేలా ఇంటింటికి తిరుగుతూ.. ప్రజల పార్టీ వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా 130వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కల్యాణి శ్రీనివాస్, ఎస్సీ మోర్చా కార్యదర్శి రవి, సత్యవతి, ఆడబాల తనుజాలత, యామిని తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు.


ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు